సాక్షి తిరుపతి

గురువారం । 7 । మార్చి । 2024



ప్రభలపై సర్వాంతర్యామి

శ్రీనివాసమంగాపురంలో సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై సర్వాంతర్యామి ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. - 8లో



అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. - 8లో



గజరాజుపై కపిలేశ్వరస్వామి

కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఉదయం వ్యాఘ్రం, రాత్రి గజరాజు వాహనాలపై ఊరేగారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ రాక

తిరుపతి అర్బన్: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం తిరుపతికి రానున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం నుంచి ఉదయం 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని, 11.30 గంటలకు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం 2.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు వెళ్లనున్నారని వెల్లడించారు.

9న పంజాబ్ గవర్నర్

పంజాబ్ రాష్ట్ర గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు. 9వ తేదీ ఉదయం 11.05 గంటలకు చెన్నై విమానాశ్రయం నుంచి రేణిగుంటకు చేరుకుని, రోడ్డు మార్గాన మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుమల పద్మావతి అతిథి గృహం చేరుకొని రాత్రికి బస చేస్తారని చెప్పారు. 10వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు బయలుదేరి వెళ్లనున్నారని వివరించారు.

13న మిగులు వస్తువుల వేలం

తిరుపతి అర్బన్: చెన్నై మాధవరం బస్టాండ్‌లోని తిరుపతి కార్గో పాయింట్ వద్ద మిగులు వస్తువులను ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు జిల్లా కార్గో ఇన్‌చార్జి సురేంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 ఆగస్టు 1 నుంచి 2023 మే 31 వరకు మిగులు వస్తువులను వేలం పాట ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. వేలం పాట పూర్తయిన వెంటనే పాడిన వ్యక్తులు ఆ మొత్తాన్ని చెల్లించి తక్షణమే ఆ వస్తువులను తీసుకుపోవాల్సి ఉందని చెప్పారు. వేలం సొమ్ము చెల్లించకపోతే వారి పాట రద్దవుతుందని స్పష్టం చేశారు.


ఇంటర్ పరీక్షకు 954 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షలో భాగంగా బుధవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మ్యాథ్స్–1ఎ, బోటనీ–1, సివిక్స్–1 సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు జనరల్‌లో 32,985 మంది, ఒకేషనల్‌లో 1,394 మంది, మొత్తం 34,379మంది పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది. అయితే జనరల్‌లో 835 మంది, ఒకేషనల్‌లో 119 మంది, మొత్తం 954 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ ఆర్‌ఐఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అందులో గురువారం 87 పరీక్ష కేంద్రాల్లో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మ్యాథ్స్–2ఏ, బోటనీ–2, సివిక్స్–2 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని ఆర్‌ఐఓ పేర్కొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్న మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి– తిరుపతి మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కలదన్నారు. నాయుడుపేట మార్గంలో ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం, పిచ్చాటూరు మార్గంలో ప్రతి 20 నిమిషాలకు బసు సర్వీసు ఉందని చెప్పారు. నాన్‌స్టాప్ సర్వీసులు శ్రీకాళహస్తి వంతెన సమీపంలోని స్వర్ణముఖి పాయింట్ వద్ద నుంచి నడపనున్నట్లు తెలిపారు. ఆర్డినరీ బస్సులు శ్రీకాళహస్తి బస్టాండు వరకు నడపనున్నట్లు తెలిపారు. చెన్నైకు అదనంగా సర్వీసులను నడుపుతామని చెప్పారు. గుడిమల్లానికి ఉదయం 10 గంటలకు మధ్యాహ్నం 1.30గంటలకు సాయంత్రం 4గంటలకు బస్సు సౌకర్యం ఉంటుందని చెప్పారు. అదే విధంగా జీవీపురం కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి ఉదయం 10గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు, సాయంత్రం 4 గంటలకు బస్సు సౌకర్యం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అయోధ్య ఆస్తా ట్రైన్ ప్రారంభం



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(అలిపిరి): తిరుపతి నుంచి అయోధ్యకు ఆస్తా స్పెషల్ పేరుతో దక్షిణ మధ్య రైల్వే నూతనంగా రైలు సర్వీసును ప్రారంభించిందని రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం తిరుపతి నుంచి అయోధ్యకు అధికారులు జెండా ఊపి రైలు ప్రారంభించారు. రూ.2,440 ప్యాకేజీ ధరతో రవాణా, వసతి, భోజన సదుపాయాలను రైల్వేశాఖ కల్పిస్తోందని చెప్పారు.

బాధ్యత బీసీకి.. పెత్తనం కమ్మకు



కుప్పంలో బీసీలను చంద్రబాబునాయుడు దగా చేస్తున్నారు. అత్యధికంగా బీసీలు ఉన్న ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. ఒకటి కాదు..రెండుకాదు.. ఏకంగా 35 ఏళ్లు పాతుకుపోయారు. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అభివృద్ధి పేరుతో గారడీలు చేస్తున్నారు. బీసీల డీఎన్‌ఏలోనే టీడీపీ ఉందంటూ బోల్తా కొట్టిస్తున్నారు. తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని వదిలి కుప్పానికి వచ్చి బీసీలను నిలువునా ముంచేస్తున్నారు. పదవి ఒకరిది.. పెత్తనం మరొకరికి అప్పగించి వేడుక చూస్తున్నారు. దీనిపై స్థానికులు రగిలిపోతున్నారు. బీసీల ద్రోహి చంద్రబాబు అంటూ విరుచుకుపడుతున్నారు. స్థానికేతరుడైన బాబుకు ఈ సారి గుణపాఠం తప్పదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

- కుప్పంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు
- నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ ఓటర్లే
- ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజికవర్గం
- అడుగడుగునా అవమానాలపై రగిలిపోతున్న కుప్పం బీసీలు

సాక్షి, తిరుపతి: బీసీలు అత్యధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గాన్ని ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. 35 ఏళ్లుగా కుప్పంలో బీసీలకు ఎమ్మెల్యే పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారు. కుప్పంలో చంద్రబాబును మోస్తున్న బీసీ నేతలు ఆయన తీరుపై మండిపడుతున్నారు. మూడున్నర దశాబ్దాలుగా మాయమాటలతో బీసీల అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో మలచుకుంటూ వారిని దగా చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా కుప్పం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇస్తూ వస్తున్నారు. 2014, 2019లో బీసీ (వన్నెకుల క్షత్రియ) సామాజిక వర్గానికి చెందిన చంద్రమౌళిని అభ్యర్థిగా నియమించారు. తాజాగా దివంగత చంద్రమౌళి కుమారుడు భరత్‌ని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. మంత్రి పదవి ఇచ్చి కేబినెట్‌లో తన పక్కన కూర్చోబెట్టుకుంటానని సీఎం ప్రకటించారు. ఎమ్మెల్యే కంటే ముందే భరత్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బీసీలను గౌరవించారు. కుప్పం నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారి ఓట్లు ఉంటే.. అందులో 23.29 శాతం ఓట్లు వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం వారివే. అయినా నియోజకవర్గంలో చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వటం లేదు. చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారి ఓట్లు ఒక్క శాతం కూడా లేవు. లెక్కపెడితే పట్టుమని వెయ్యి ఓట్లు కూడా లేవని తేలింది.

కుప్పంలో కులాల వారీగా ఓట్లు

సామాజిక వర్గం	ఓట్ల శాతం
వన్నెకుల క్షత్రియులు	23.29
ఎస్సీ	14.65
కురబ, యాదవ	7.46
ముస్లింలు	6.91
బలిజ	6.79
బోయ, వాల్మీకి	6.01
గాండ్ల	5.30
రెడ్డి	4.52
వడ్డెర	3.84
అగముడిగస్	2.71
ఎస్టీ	2.33
రజక	1.62
విశ్వకర్మ	1.51
దాసరి, జంగమ	1.49
ముత్తరాసి	1.32
బ్రాహ్మణ	1.08
మంగలి	1.07
వైశ్య	1.06

పేరుకే బీసీ ఇన్‌చార్జ్

ముప్పై ఐదేళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు నివాసం మాత్రం హైదరాబాద్‌లో. కుప్పంలో తనకు బదులు బీసీ సామాజిక వర్గానికి చెందిన మునిరత్నంను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆయన పేరుకే ఇన్‌చార్జ్, పెత్తనమంతా కమ్మసామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు అప్పగించారు. ఈయన ప్రకాశం జిల్లాకు చెందిన నాయకుడు కావటం గమనార్హం. కొంతకాలంగా నియోజకవర్గంలో ఆయన పెత్తనమే నడుస్తోంది. స్థానిక టీడీపీ నాయకుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టినట్లు సమాచారం. స్థానిక నాయకులకు ప్రాధాన్యం లేకపోవటంతో టీడీపీ నాయకులు అవమానంగా భావిస్తున్నారు. చంద్రబాబును 14 ఏళ్ల సీఎంగా, ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నా కనీసం తాగు, సాగు నీరు కూడా తీసుకురాలేకపోయారని నియోజకవర్గ ఓటర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమతో పార్టీకి ఊడిగం చేయించుకుని ఇప్పుడు బయటి వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తారా? అంటూ బీసీ నేతలు మండిపడుతున్నారు.

పక్క రాష్ట్రాల నుంచి..

ఎన్నికల కోసం అంటూ కుప్పంలో మరో రెండు వేల మందిని పక్క రాష్ట్రాల నుంచి బాబు దింపుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 200 మంది కర్ణాటక వాసులు కుప్పంలో తిష్టవేశారు. వీరు గ్రామాలు, వార్డుల్లో టీడీపీ శ్రేణులు, ఓటర్లు ఎటువైపు ఉన్నారో సర్వే చేసి చంద్రబాబుకు నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఎన్నికల్లో స్థానికులకే కాకుండా బయటి వారికే బాధ్యతలు అప్పగించటం మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే 2వేల మంది కర్ణాటక, తమిళనాడు వాసులను కుప్పానికి దిగుమతి చేసుకోనున్నారు. వీరంతా టీడీపీ శ్రేణులపై నిఘా పెట్టటడంతో పాటు, కుప్పం ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక కుప్పానికి కృష్ణా జలాలు తీసుకు రావడం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.1,400 కోట్లు ఖర్చుచేయడంపై జరుగుతున్న చర్చ నుంచి ఓటర్ల దృష్టిని మరల్చేందుకే వీరిని రంగంలోకి దింపుతున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

మార్మోగిన శివనామ స్మరణ



శివదీక్ష తీసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల శివ నామస్మరణతో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో పాటు పెద్దఎత్తున సామూహిక శివదీక్షను స్వీకరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే అందరికీ దీక్షాధారణ దుస్తులను పంపిణీ చేశారు. వేదపండితులచే సంప్రదాయ బద్ధంగా దీక్ష స్వీకరించిన అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో కాసేపు శివనామ స్మరణ చేశారు. కార్యక్రమంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, బియ్యపు ఆకర్ష్ రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత

తిరుపతి అర్బన్: వైఎస్సార్ చేయూత జిల్లా కార్యక్రమాన్ని తిరుపతి కలెక్టరేట్ నుంచి గురువారం ప్రారంభించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా నుంచి నాలుగో విడత వైఎస్సార్ చేయూత నగదు జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో ప్రారంభించగా.. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. తిరుపతి జిల్లాలో 1,12,436 మంది అక్క చెల్లెమ్మలకు నాలుగో విడత వైఎస్సార్ చేయూత కింద రూ.210.82 కోట్లు జమచేయనున్నట్టు వెల్లడించారు.

పీజీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఎంఏ మ్యూజిక్, ఎమ్మెస్సీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ తెలిపారు. ఎమ్మెస్సీలో జాగ్రఫీ, అప్లైడ్ స్టాటిస్టిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, అనిమల్ బయోటెక్నాలజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి!



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గురుమూర్తి, రామ్‌కుమార్ రెడ్డి

కలువాయి: రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ఇలాగే కొనసాగించేందుకు ప్రజలు ఫ్యాను గుర్తుకు ఓటువేసి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంతోపాటు తెలుగురాయపురం, చినగోపవరం నూతన సచివాలయ భవనాలను బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం కలువాయిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లారని అన్నారు. వెంకటగిరి నియోజవకర్గంలో 96 వేల కుటుంబాలు ఉంటే, వాటిలో 88 వేల కుటుంబాలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా రూ.1300 కోట్లు అందించామని వివరించారు. నాన్ డిబిటి ద్వారా 600 కోట్లు విలువైన ఇళ్ల స్థలాలు, ఇళ్లు, తదితరాలు అందించామన్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకంటే వెంకటగిరి నియోజకవర్గంలో తనకు ఎక్కువ ఓట్లు వచ్చాయని ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఎంపీ గురుమూర్తి అన్నారు. స్థానిక నాయకులు జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి కలువాయి చెరువు ఆయకట్టు పొలాలకు రోడ్డు సౌకర్యం, కాల్వల అభివృద్ధి, రెండు జాతీయ రహదారులకు లింక్ చేసే విధంగా కలువాయి రోడ్డును ఆదూరుపల్లి వద్ద నుంచి 10 మీటర్ల రోడ్డుగా విస్తరించాలని వారి దృష్టికి తెచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మాదాసు పవన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావణ బ్రహ్మపై పరమశివుని వైభవం



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



రావణబ్రహ్మ వాహనాలపై శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞాన ప్రసూనాంబ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరస్వామి రావణ వాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం హంస, యాళి వాహనాలపై స్వామి అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ అలంకార మండపం యాగశాలలో పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామివారు రావణ వాహనంపై, అమ్మవారు మయూర వాహనంపై, వినాయకుడు మూషిక వాహనం, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, చండికేశ్వరస్వామి, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి అమ్మవార్లను అనుసరించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- మిచాంగ్ బాధితులకు నష్టపరిహారం
- 6,996 మందికి రైతులకు రూ.5.9 కోట్లు



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, వ్యవసాయశాఖ అధికారులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత కు వెన్నుదన్నుగా నిలుస్తోందని కలెక్టర్ జీ.లక్ష్మీశ కొనియాడారు. మిచాంగ్ తుపాన్ బాధితులకు బుధవారం నష్టపరిహారం అందించే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముందుగా తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని అంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని 6,996 మంది రైతులకు చెందిన నష్టపరిహారాన్ని రూ.5.90కోట్ల చెక్‌ను డీఏవో ప్రసాద్ రావు, ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డితో కలసి లబ్ధిదారులకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా పంట నష్టపరిహారం రైతుల ఖాతాలో జమ చేసిందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ధనంజయరెడ్డి, ఏవో గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు

వచ్చే సార్వత్రిక ఎన్నికలు వందశాతం పారదర్శకంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆయన కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీలో ఉంటున్న వ్యక్తి కచ్చితంగా ఎన్నికల నియమాలను పాటించాలని స్పష్టం చేశారు. సమావేశాల్లో మాట్లాడే సమయంలో అసభ్య పదజాలం వాడకూడదని స్పష్టం చేశారు. అవాస్తవాలను ప్రచారం చేయకూడదని సూచించారు. కుల,మతాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు ఉండరాదని వెల్లడించారు. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని కోరారు. స్టార్ క్యాంపెయినింగ్ చేస్తున్న వారు ఎన్నికల నిబంధనలు తు.చ.తప్పకుండా పాటించాలని చెప్పారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఈఆర్‌వోలు మరోసారి పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించాలని చెప్పారు. అన్నిచోట్ల సౌకర్యాలను ఏర్పాటు చేసినప్పటికీ, లోటుపాట్లు ఉంటే సవరించాలని పేర్కొన్నారు. అభ్యర్థిగా నామినేషన్ వేసే వారి నుంచి కొత్తగా కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని, గతంలో రాష్ట్రంలో మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ పత్రంతో ఆమోదించాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ నుంచి ఏపీలోని ఐదు పార్టీలకు గుర్తులు కేటాయించారని తెలిపారు. డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 15 నుంచి 2024 మార్చి 5వ తేదీ వరకు 6,7, 8 ఫామ్స్ 22,977 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఆర్‌ఓలు కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్ పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఐదు రాజకీయ పార్టీలకు గుర్తుల కేటాయింపు

రిఫార్మసీ పార్టీ ఆఫ్ ఇండియా	– టైర్స్
భారతీయ యోజన రైతు పార్టీ	– వాటర్ ట్యాంక్
జన శంఖారావం పార్టీ	– లేడీ ఫింగర్
గోండ్వాన దండకారణ్య పార్టీ	– మ్యాన్ బ్లోయింగ్ తురా
నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	– బకెట్ గుర్తు

క్లుప్తంగా

అర్హులందరికీ అక్రిడిటేషన్

తిరుపతి అర్బన్: జిల్లాలో అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు అందిస్తున్నామని జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టులకు 2023 మార్చి 30న అక్రడిటేషన్లు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను అనుసరించి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్, డీఐపీఆర్ఓ బాలకొండయ్య, కమిటీ సభ్యులు తిరుమల రవి రెడ్డి, ముని కృష్ణయ్య, కార్తీక్, డివిజనల్ పీఆర్ఓ ఈశ్వరమ్మ, అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్‌మెంట్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

తిరుమలలో మరో లేపాక్షి ఎంపోరియం



టీటీడీ చైర్మన్‌తో విజయలక్ష్మి చంద్రమౌళి

తిరుపతి మంగళం : తిరుమలలో రెండవ లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు టీటీడీ స్థలం కానీ, భవనం కానీ కేటాయించాలని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్(లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బడిగించల చంద్రమౌళి కలిసి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కోరారు. ఈ మేరకు వారిద్దరూ బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో భూమన కరుణాకర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో ఇప్పటికే ఒక లేపాక్షి ఎంపోరియం ఉందని, మరొకటి ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. అనంతరం శ్రీవారి ఫొటోను బహుకరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా దేవాంగ నాయకులు గుత్తి త్యాగరాజు, తిరుపతి లేపాక్షి ఎంపోరియం మేనేజర్ చలమత్తూరు రవి, సిబ్బంది శ్రీధర్, వీరాంజనేయులు ఉన్నారు.

రైలు కింద పడి విద్యార్థి మృతి

తిరుపతి క్రైమ్: తిరుపతి రైల్వే స్టేషన్ పరిధిలో విద్యార్థి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు, వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగుకు చెందిన రవికుమార్ కుమారుడు జితేంద్ర (18) ఇటీవల ఐటీఐ ఫెయిల్ అయిపోయాడు. దీంతో మనస్థాపానికి గురై తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పట్టాలపై మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



చిగురువాడలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

- సీఎంగా మళ్లీ అవకాశం కల్పించేందుకు సిద్ధం
- 25 సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత

తిరుపతి రూరల్: సంక్షేమం అభివృద్ధిని సమపాళ్లలో పరుగులు తీయిస్తున్న జగనన్నకు మళ్లీ సీఎంగా అవకాశం కల్పించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని చిగురువాడ, అవిలాల పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. అంతకుముందు చిగురువాడలో వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామాల పొలిమేరల నుంచి యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరణతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. 'మన ఊరు మన మోహిత్' పాటల సీడీని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆవిష్కరించారు.

సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే సాధ్యమని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. జగనన్న పాలన మళ్లీ వస్తేనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. వలంటీర్, సచివాలయాల వ్యవస్థలు కొనసాగాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించేలా, నేడు దేశానికి దిక్సూచిగా బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచారని తెలిపారు. ప్రతి కుటుంబానికి 25 రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. అక్క చెల్లెమ్మలకు రూ.25 వేల కోట్లు ఆసరా పథకం కింద అందజేశామన్నారు.

వ్యక్తిగత సాయానికి వెనుకాడం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాల పంపిణీకే పరిమితం కాలేదు.. నియోజవర్గ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి కరోనా సమయంలో అండగా నిలిచాం.. ముప్పు పరిస్థితుల్లో రాయల చెరువు కట్టపైనే ఉంటూ.. పరిస్థితులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చక్కబెట్టారని మోహిత్‌రెడ్డి గుర్తు చేశారు. సొంత నిధులతో పెళ్లి, పండుగల కానుకలు అందజేశామన్నారు. చంద్రగిరి నియోజవర్గంలోని 6 మండలాలను తుడా పరిధిలోని తీసుకొచ్చి వందల కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. 2014, 2019 ఎన్నికల్లో అండదండగా ఉండి.. వెన్నుతట్టి ప్రోత్సహించిన చిగురువాడ, అవిలాల పంచాయతీ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా..

చిగురువాడ పంచాయతీలో రూ.7 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. ఏకంగా 23 సీసీ రోడ్లు, ఆర్వో వాటర్ ప్లాంట్, యోగా ధ్యానమందిరం తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.3.31 కోట్లు ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. 4,988 మందికి రూ.26.97 కోట్లు సంక్షేమ నిధులు పంపిణీ చేశామన్నారు. అవిలాల పంచాయతీలో రూ.17.58 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవిలాలలో రూ.23.36 కోట్లు, ఆంధ్రాబ్యాంక్ కాలనీలో రూ.12.57 కోట్ల నిధులు సంక్షేమ పథకాల ద్వారా నిధులు అందజేశామన్నారు. రూ.2.15 కోట్ల ఆసరా నిధులు చెక్కును అందజేశారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవ ఉత్సవాల్లో భాగంగా రెండో ఆలయ ప్రాంగణం హోమాలతో, వేద మంత్రోచ్ఛరణతో మార్మోగింది. రెండో రోజు బుధవారం వేకువ జామున స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో నిద్ర మేల్కొల్పి పూజా కార్యక్రమాలను కొనసాగించారు. శ్రీ మహా గణపతి పూజా కార్యక్రమంతో ప్రారంభించి శ్రీ సుబ్రమణ్యస్వామికి సహస్ర నామ కుంకుమార్చనలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం శ్రీ మహా గణపతి హోమం, రుద్రహోమం, నవ గ్రహ హోమం, మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయణం, శ్రీ సిద్ధేశ్వరిదేవికి సహస్ర నామ కుంకుమార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టారు. ఉభయదారులుగా పోతిరెడ్డి రేవతి, రెడ్డెప్పరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో తలకోన ట్రస్టు బోర్డు చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జయకుమార్, పాలక మండలి సభ్యులు నాగిరెడ్డి, మంజుల, నరేష్, మధుసూదనశెట్టి, జయంత్, గంగోజీ, రాజేశ్వరి, గీత, ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసన్నశర్మ, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గజరాజుపై కపిలేశ్వరస్వామి అభయం



వ్యాఘ్రవాహనంపై ఊరేగుతున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం రాత్రి సర్వాంగసుందరంగా ముస్తాబైన శ్రీకపిలేశ్వరస్వామి గజవాహనాన్ని అధిరోహించి భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి గజవాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామి వారి గజవాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు అందించి దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి వ్యాఘ్ర వాహనంపై కొలువై శ్రీసోమస్కందమూర్తి శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయ ఆవరణలోని మండపంలో అర్చకులు స్నప న తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీసోమ స్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. గురువారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి అశ్వవాహనంపై విహరిస్తూ స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సూర్యచంద్రులపై సర్వాంతర్యామి విహారం

- వైకుంఠాన్ని తలపిస్తున్న శ్రీనివాసమంగాపురం
- అంగరంగ వైభవంగా సాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు



సూర్య ప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్న గోవిందుడు



చంద్ర ప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో జరుగుతున్న వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైకుంఠాన్ని తలపిస్తున్నాయి. నిత్యం భక్త జన సంకీర్తనలు, కోలాటాలు, బాజా భజంత్రీలతో ఆధ్యాత్మికత నిండిపోయింది. కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు బుధవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీరామకృష్ణ గోవింద అలంకరణలో స్వామి వారు సూర్యప్రభామధ్యస్థుడై దివ్య కిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ, సూర్యప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. అంతకముందు ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి నిర్వహించారు. స్వామి వారికి ఫల, పుష్ప, సగంధ, పన్నీటి ద్రవ్యాలతో అభిషేక సేవతో పాటు, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకార మండపంలోకి వేంచేపు చేశారు. అనంతరం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆశీనులయ్యారు. సూర్య మండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యున్ని సూర్యనారాయణుడు అని కొలుస్తాం. ఇంతటి మహాతేజ పరిపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే శ్రీమహావిష్ణువులను దర్శించే భక్తులకు ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. అనంతరం స్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీనివాసుడు చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చి చల్లని అమృత కిరణాలతో భక్తులను అనుగ్రహించారు. నక్షత్రాలకు చంద్రుడు అధిపతి. అటువంటి చంద్రుడిని వాహనంగా చేసుకుని శ్రీవారు భక్తులను కటాక్షించారు. వాహన సేవకు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారికి ధూప, దీపాలతో మంగళ హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయలు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనాలపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు.

రైతు సేవలో అగ్రగామి తిరుపతి

- రాష్ట్రంలో మళ్లీ మనమే ఫస్ట్
- ఈ ఏడాదిలో ఫిబ్రవరికి ప్రథమస్థానం
- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ వ్యవసాయ అధికారిగా ప్రసాద్‌రావు



జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం

తిరుపతి అర్బన్: వ్యవసాయ విభాగానికి సంబంధించి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి తిరుపతి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. ఆ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు రాష్ట్రస్థాయి ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ బుధవారం ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగుల వివరాలను జాబితాను ప్రకటించారు. ప్రతి నెలా వ్యవసాయశాఖ రాష్ట్రస్థాయిలో ఒక జిల్లా అధికారిని ఎంపిక చేసి రైతు భరోసా పుస్తకంలో ప్రచురించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది(2023లో) రైతు భరోసా పుస్తకంలో ఫిబ్రవరి, మార్చి, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో తిరుపతి జిల్లానే ప్రథమ స్థానంలో నిలిచింది. 2023కి సంబంధించి ఆరు నెలలు తిరుపతి జిల్లానే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో రాష్ట్ర స్థాయి అధికారులు తిరుపతి జిల్లా ఉద్యోగులను అభినందించారు.

ఈ ఏడాదిలోను జనవరి, ఫిబ్రవరి నెలల్లో వరుసగా రెండు నెలలు తిరుపతి జిల్లాకే ప్రథమ స్థానం దక్కింది. ఫిబ్రవరి నెలకు సంబంధించి తిరుపతి జిల్లా ప్రథమస్థానం, రెండో స్థానం కాకినాడ జిల్లా, మూడో స్థానంలో చిత్తూరు జిల్లా, 26వ స్థానం(చివరిస్థానం) అల్లూరి సీతారామరాజు జిల్లాకు దక్కింది. సీహెచ్‌సీ గ్రూపుల పురోగతి, రబీలో ఎరువుల సరఫరా, పొలంబడి గ్యాప్ కార్యక్రమాలు, కియోస్కుల పనితీరు, రబీ సీజన్‌కు సంబంధించి ఈకేవైసీ నమోదు 99.5శాతంతో రైతులు ప్రభుత్వ పథకాలు పొందడం తెలిసిందే. తదితర అంశాల్లో జిల్లా ముందు వరుసలో ఉండడంతోనే స్టేట్‌లో ప్రథమస్థానం సాధించింది. దీంతో వ్యవసాయశాఖ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వ్యవసాయ ఉద్యోగులను డీఏవోతోపాటు ఏడీఏలు అభినందించారు.

సమష్టి కృషితోనే విజయం



సమష్టి కృషితోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయానికి ప్రధాన కారణం అధికారులు, ఉద్యోగులే, ఏదైనా రాష్ట్ర స్థాయి నుంచి ఉత్తర్వులు వస్తే వాటిని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులకు ఆదేశిస్తున్నాం. వారు నిర్లక్ష్యం లేకుండా వెంటనే ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తున్నారు. మరోవైపు వారిని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎప్పటికప్పుడు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంతో సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులంతా ముందుకు సాగుతాం.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

గంజాయి పట్టివేత



గంజాయి, నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

గూడూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని పట్టుకుని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ రమేష్ కథనం మేరకు పట్టణంలోని విఘ్నేశ్వర పురం వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయితో సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బందితో కలసి తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు తమిళనాడు ప్రాంతానికి చెందిన వేలు జయకుమార్, గుణశేఖరన్‌గా తేలింది. వారు అనకాపల్లిలోని అరుణ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి చెన్నై ప్రాంతంలోని ప్రసాద్‌కు అందించేందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐలు బ్రహ్మనాయుడు, మోజస్, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది రమేష్, ప్రసాద్, క్రిష్టయ్య, గౌస్‌బాషా, ఆనంద్‌బాబు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

గూడూరు రూరల్: హత్య కేసులో నిందితుడికి గూడూరు కోర్టు బుధవారం జీవిత ఖైదు విధించింది. పోలీసుల వివరాల మేరకు.. నాయుడుపేట మండలం, అన్నమేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన వీరాస్వామి 2022లో కత్తితో దాడిచేసి హత్య చేశాడు. ఈ మేరకు అప్పట్లో నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి నిందితుడు వీరాస్వామిని కోర్టులో హాజరు పరచగా జడ్జి అతనికి రిమాండ్ విధించారు. అటు తరువాత కేసు గూడూరు ఏడవ అదనపు జిల్లా కోర్టుకు రావడంతో అక్కడ వాదోపవాదాలు పూర్తి కాగా ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్విన్ సుల్తానా బేగం నిందితుడికి జీవిత ఖైదు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుహాసిని వాదించారు. హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ లైజనింగ్ అధికారిగా వ్యవహరించారు.

రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు సూపర్ స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలను ప్రారంభించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు మాట్లాడుతూ ప్రతి సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో సూపర్ స్పెషాలిటీ ఓపీ, ఐపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.